సాక్షి
శ్రీకాకుళం
బుధవారం। 30। అక్టోబర్। 2024



అసాంఘిక పనులకు అడ్డాగా..!

జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీ ఆకతాయిలకు అడ్డాగా మారింది. పరిస్థితులు దిగజారుతున్నాయి. -8లో



వంతెన చెంతనే తవ్వకాలు

తెలికిపెంట బ్రిడ్జి కిందనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎవరూ స్పందించడం లేదు. -8లో

ఒకటి నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవంబర్ ఒకటో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెలకు గాను అన్ని రకాల పింఛన్లు కలిపి 3,14,385 పింఛన్లు విడుదలయ్యాయని, దీనికి గాను రూ. 128.40 కోట్లు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ముగ్గురు డీసీలకు జిల్లాలో పోస్టింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్‌లో జిల్లాకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. వీరిలో పలాస రెవెన్యూ డివిజినల్ అధికారిగా జి.వెంకటేశ్వర్లును నియమించింది. కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ విభాగం అధిపతిగా డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతిని నియమించారు. ఎం.లావణ్యను బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు భూ సేకరణ అధికారి ఎస్‌డీసీగా నియమించారు. ఈమె తూర్పుగోదావరి జిల్లా డిజాస్టర్ మేనేజ్ మెంటు విభాగంలో డీపీఎంగా పనిచేసి బదిలీపై వస్తున్నారు.

భావనపాడు తీరం పరిశీలన



భావనపాడు తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐసీఈఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ఎంబీ బెలియప్ప

సంతబొమ్మాళి: భావనపాడు తీర ప్రాంతాన్ని బెంగళూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ తీర ప్రాంత ఇంజనీర్ సంస్థ (సిఐసిఈఎఫ్) డిప్యూటీ డైరెక్టర్ ఎంబీ బెలియప్ప మంగళవారం పరిశీలించారు. మత్స్యకారుల బోటులో ప్రయాణించి ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత స్థలాన్ని, సముద్ర ముఖద్వారం వద్ద మేటలు వేసిన ఇసుక దిబ్బలను, ముఖ ద్వారానికి ఇరువైపులా ఉన్న క్రీక్ వాల్‌ను పరిశీలించారు. ఇసుక మేటలను శాస్త్రీయంగా పరిష్కరించే నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు. అంతకుముందు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ సముద్ర ముఖద్వారం వద్ద ఇసుక మేటలు వేయడం వల్ల వేట నిషేధిత కాలం నుంచి ఇప్పటి వరకు వేట సాగక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, టెక్కలి ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో, స్థానిక సర్పంచ్ బి.మోహన్ రెడ్డి, మత్స్యకార సొసైటీ సంఘం అధ్యక్షుడు గోరకల ఆదినారాయణ, మత్స్యకార నాయకులు సైన గురువులు, కారాడ పోతయ్య, కారాడ చిన్నబాబు, కారాడ మురళి, తులసి దాస్, అల్ల రాజేష్, సురాడ రాజారావు, అప్పాజీ ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఈదుపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇచ్ఛాపురం రూరల్: సీఎం చంద్రబాబు నాయుడు నవంబర్ 1న ఈదుపురంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌లు సభాస్థలిని పరిశీలించారు. మంగళవారం హెలీప్యాడ్, సభా స్థలిని పరిశీలించి గ్రామంలో ఆయన పర్యటించారు. పలు శాఖాధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై చర్చించారు. ఇన్‌చార్జి ఆర్డీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీఓ కె.రామారావులు ఉన్నారు.

గుండె గు'బిల్లు'



రూ.11,425 కరెంట్ బిల్లు వచ్చిందని చూపుతున్న బాధితుడు

టెక్కలి రూరల్: స్థానిక మండపాలెం కాలనీకి చెందిన బి.కామేశ్వరరావు అనే వ్యక్తికి కరెంటు బిల్లుల చూసి గుండె ఆగినంత పనైంది. తన ఇంటికి ఎలాంటి ఎలక్ట్రికల్ సామాన్లు లేవని, కానీ బిల్లు రూ.11,425 వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత బిల్లు ఎందుకు వచ్చిందో అడిగేందుకు వెళ్లినా ఎవరూ స్పందించడం లేదని చెబుతున్నాడు.

జీడి మామిడి రైతులకు పంటల బీమా పరిహారం

శ్రీకాకుళం (పిఎస్‌కాలనీ): జిల్లాలోని సుమారు 50వేల ఎకరాల్లో సాగుచేస్తున్న జీడిమామిడి రైతులకు ప్రభుత్వం పంటల బీమా పరిహారాన్ని అందిస్తున్నట్లు ఉద్యానవనశాఖ ఏడీ ఆర్‌వీ వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీడి మామిడి రైతులు నవంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

'ప్రమిద' గణాలు


దీపావళికి మార్కెట్‌లో మట్టి దీపాలు సందడి చేస్తున్నాయి. సంప్రదాయంగా వస్తున్న మట్టి ప్రమిదలతో పాటు సరికొత్త రూపాల్లోనూ ప్రమిదలు కొనుగోలు దారులను ఆకట్టుకుంటున్నాయి. నూనె పోస్తే ఇంకని ప్రమిదలు జోరుగా అమ్ముడవుతున్నాయి. – శ్రీకాకుళ కల్చరల్



తులసి కుండీ ప్రమిదలివి. రూ.20–30 వరకు పలుకుతున్నాయి. చిన్న, పెద్ద సైజుల్లో ఆకట్టుకుంటున్నాయి



కుండ ఆకారంలో ఉండే దీపాలివి. దీనిపైన మామూలు చిమ్నీ పెట్టుకోవచ్చు. దీపం ఆరకుండా రక్షణగా దీన్ని పెట్టుకుంటారు. దీని ఖరీదు రూ.60.



పైన మూతతో ఉన్న ప్రమిద ఇది. ఇందులో నూనెపోసి దీపం వెలిగించి ఈ మూత పెట్టుకుంటారు. గాలి వేసినా దీపం ఆరిపోకుండా ఉంటుంది. దీని ఖరీదు కూడా రూ.60.



ఈ ప్రమిదలు ఇక్కడ తయారుచేస్తున్నారు. దీనిలో నూనె పోస్తే ఇంకదు. నూనె కూడా ఎక్కువ పడుతుంది. ఇవి ఇక్కడి కుమ్మరులు తయారు చేస్తున్నారు. వీటి ఖరీదు డజను రూ.30లు.

వీటికి ఎక్కువ డిమాండ్



దీపావళి సమయంలో చెన్నై నుంచి వచ్చిన ప్రమిదలకు ఎంతో డిమాండ్ ఉంది. వీటిని మేము విశాఖనుంచి తీసుకొచ్చి అమ్మకానికి పెడతాం. ఇందులో ఎన్నో రకాల డిజైన్లు ఉన్నాయి. వీటిలో నూనె పోస్తే ఇంకదు. ఆకర్షణీయంగా ఉంటాయి. సూర్యనారాయణ, అమ్మకందారుడు






చిన్న చిన్న అందమైన ప్రమిదలివి. చిన్నవి డజను రూ.30లుగా అమ్ముతున్నారు. అయితే దీపం సెమ్మె రకంది. ఒక్కొక్కటి రూ.10లు

అవినీతి అనకొండలు..





కృష్ణాపురం వద్ద ప్రస్తుతం తరిగిపోయిన కొండ



కృష్ణాపురం వద్ద కొండ(పాత చిత్రం)

పట్ట పగలే బాంబులు పెట్టి పేల్చుతున్నారు.. అయినా అడిగే నాథుడే లేకుండాపోయాడు. అనుమతి లేకుండానే కొండలు పిండి చేస్తున్నారు.. అయినా అడ్డుకునే అధికారి లేడు. రెండు క్వారీలకు అనుమతి తీసుకుని 50 క్వారీలు నడిపిస్తున్నారు.. నిలదీసే మనిషే లేడు. పొందూరులో అవినీతి అనకొండలు రెచ్చిపోతున్నారు. కూటమి నాయకులతో జట్టు కట్టి కొండల్లో కాసుల వేట సాగిస్తున్నారు. తమకు ఎలాంటి నిబంధనలు లేవంటూ.. యథేచ్ఛగా అక్రమాలు సాగిస్తున్నారు.

విచారణ చేస్తాం

డీ పట్టా భూములను కేవలం వ్యవసాయానికే వినియోగించాలి. ఈ భూముల్లో మైనింగ్ నిర్వహించకూడదు. మండలంలోని కృష్ణాపురం సర్వే నంబర్లలో క్వారీలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి డీ పట్టా భూముల్లోని క్వారీల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వారి భూములను స్వాధీనం చేసుకుంటాం. – వెంకటేష్ రామానుజులు, తహసీల్దార్(ఎఫ్ఏసీ), పొందూరు

అనుమతులు లేవు

మైనింగ్ శాఖ రికార్డుల ప్రాప్తి మేరకు పొందూరు మండలంలో క్వారీలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమ క్వారీ నిర్వాహకులకు వారు చేసిన క్వారీలు అక్రమమని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి జరిమానా వసూలు చేస్తాం. – సి.మోహనరావు, మైనింగ్ అధికారి, శ్రీకాకుళం

- పొందూరులో తరిగిపోతున్న కొండలు
- లైసెన్సులు లేకపోయినా క్వారీల నిర్వహణ
- డీ పట్టా భూముల్లో యథేచ్ఛగా క్వారీలు
- అనధికారికంగా బాంబ్ బ్లాస్టింగ్‌లు
- పట్టించుకోని అధికారులు
- క్వారీల నిర్వాహకులకు కూటమి నాయకుల అండ

పొందూరు:

పొందూరు మండలంలో అనుమతులు తీసుకున్న క్వారీల సంఖ్య రెండు. కానీ ఇక్కడ నిర్వహిస్తున్న క్వారీల సంఖ్య 50కుపైగానే. ఇక్కడ ఎంతలా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయో చెప్పేందుకు ఈ లెక్కలే ఉదాహరణ. మీరెప్పుడైనా రాపాక నుంచి ఇల్లయ్యగారి పేట, పొందూరు నుంచి చిలకపాలెం రోడ్డువైపు వెళ్తే ఇక్కడ పరిస్థితి ప్రత్యక్షంగా చూడవచ్చు. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ఈ దారుల్లో ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. నిర్మాణాల కోసం ఇక్కడ కొండరాళ్లను యథేచ్ఛగా పేల్చి తరలిస్తున్నారు. కూటమి నాయకులు అండగా ఉండడంతో అధికారులు కూడా వీరిని ఏమీ అనలేకపోతున్నారు. కొన్ని క్వారీలైతే కూటమి నాయకులే నిర్వహిస్తున్నారు. కొండ రాళ్ల పేలుళ్లలో అమ్మోనియం నైట్రేట్, జిలెటిన్ స్టిక్స్‌ను, డిటోనేటర్లను ఉపయోగిస్తుండడం గమనార్హం. ఈ పేలుళ్ల ధాటికి స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకపోయినా..

వాస్తవానికి క్వారీల నిర్వహణకు కలెక్టర్, రెవెన్యూ, మైనింగ్, పోలీసు, పంచాయతీ తదితర శాఖల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. సొంతంగా బ్లాస్టింగ్ చేసుకోవాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. బ్లాస్టింగ్ లైసెన్స్ కూడా ఉండాలి. కానీ బ్లాస్టింగ్ లైసెన్స్ ఉన్న ఏజెన్సీలతో పలువురు క్వారీ నిర్వాహకులు టైఅప్ చేసుకొని పేలుళ్లు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ నోరెత్తడం లేదు. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగలకు మాత్రం అధికారులు క్వారీల్లోకి వెళ్లి నామమాత్రం హడావుడి చేస్తున్నారు. ఈ తంతు అధికారుల స్వప్రయోజనాలకు పనికొస్తుందే తప్ప క్వారీ కార్మికులకు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వడం లేదు.

సమయపాలన లేకుండా..

క్వారీల్లో పేలుళ్లు రాత్రి పది గంటలు దాటాక చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇక్కడ పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారం పేల్చుతున్నారు. కనీసం హెచ్చరికలు కూడా చేయడం లేదు. ఈ పేలుళ్ల రాళ్లు రోడ్డు మీద పడుతుండటంతో వాహనదారులు, బాటసారులు గాయపడుతున్నారు. ఈ పేలుళ్లకు ఇంటి పైకప్పులు, గోడలు బీటలు వారిన సంఘటనలు, మెట్లు భాగం కిందకు జారడం, అంగవైకల్యం చెందడం, మృతి చెందడం వంటివెన్నో జరిగాయి. క్వారీ నిర్వాహకులు చేతులు తడపడం వల్లనే వారి జోలికి ఎవరూ వెళ్లడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.



సర్వే నంబర్ 335, డీ పట్టాలో అక్రమ క్వారీ నిర్వహణ

డీ పట్టా భూముల్లోనూ..

కేవలం ప్రభుత్వం అనుమతులిచ్చిన సర్వే నంబర్లలోనే క్వారీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ మండల పరిధిలో డీ పట్టా భూముల్లోను అనధికార క్వారీలు నిర్వహిస్తున్నారు. కోట్లు కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు తరలిస్తూ డీ పట్టా భూముల్లోను రోజుకు రూ.లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారు. కృష్ణాపురం సమీపంలోని సర్వే నంబర్ 335లో కొన్ని హెక్టార్లలో అనధికార క్వారీలను దశాబ్దాలుగా నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంచాడ రమేష్, కొంచాడ రామినాయుడు, అప్పారావు, వోల్ల రామారావు, కొంచాడ గౌరీనాయుడు, ఖండాపు అక్కలనాయుడు, కొంచాడ శశి, పట్నాన రమణ, కడగళ్ల అప్పలనాయుడు, పతివాడ రమణమూర్తిలతో పాటు మరో 20 మంది క్వారీలు నిర్వహిస్తున్నారు.



జిలెటెన్ స్టిక్స్



డిటోనేటర్లు

జిల్లాలో 90 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతి



ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో అమ్మకాలు జరిపేందుకు టెంట్లు సిద్ధం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని ముప్పై మండలాల పరిధిలో 90 దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు ఇచ్చామని, అనధికారికంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అగ్నిమాపక అధికారి (డీఎఫ్ఓ) జె.మోహనరావు తెలిపారు. దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అయితే విక్రయాలకు దీపావళి రోజు, ముందు రోజు (రెండురోజులు) మాత్రమే అనుమతులుండటంతో వ్యాపారులు పూర్తిగా దిగాలయ్యారు. జిల్లాకేంద్ర సమీప ప్రాంతాలవారు కూడా సామగ్రి దొరుకుతుందో లేదో అని తర్జనభర్జన పడుతున్నారు. కొంతమంది పర్లాఖిమిడి, విజయనగరం ప్రాంతాలకు వెళ్లిపోతుండగా మరికొంతమంది జిల్లాలో పర్మినెంటు షాపుల్లో ఇప్పటికే తెచ్చుకుంటున్నారు.

దళితుల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపు



టెక్కలి: ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండా తమ ఇళ్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగించేశారంటూ టెక్కలి మండలం తొలుసూరుపల్లి పంచాయతీ మునసబుపేట గ్రామానికి చెందిన దళితులు వాపోయారు. దళిత వాడలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఉన్నప్పటికీ హఠాత్తుగా బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు గ్రామానికి వచ్చి కనెక్షన్లు తొలగించారంటూ గ్రామానికి చెందిన టి.సూర్యం, డి.విజయ్‌రావు, బి.ప్రభాకరరావు, డి.భూషణరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో తొలగించిన విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. గ్రామంలో విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ ఉన్నప్పటికీ కొంత మంది వినియోగదారులు వారి వివరాలను అప్‌డేట్ చేసుకోకపోవడంతో కనెక్షన్లు తొలగించామని పేర్కొన్నారు. సబ్సిడీ వర్తిస్తున్న వినియోగదారులు వారి వివరాలను అప్‌డేట్ చేసుకుంటే మళ్లీ విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు గణేష్


గణేష్‌కు ఎంపిక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న పి.గణేష్ జాతీయ స్థాయిలో జరిగే ప్రీ- రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.లత మంగళవారం తెలిపారు. మహారాష్ట్రలోని జలగాన్‌లో నిర్వహిస్తున్న పశ్చిమ జోన్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎన్ఎస్ఎస్ పీఓలు పి.ఢిల్లీశ్వరరావు, నాగరాజు అభినందించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస రైల్వే క్వార్టర్స్ సముదాయంలో ఈ నెల 27న ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని యజమాని రాబిన్స్ కుమార్ మంగళవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పనిచేసేందుకు ఆహ్వానించిన కాంట్రాక్టు టీచింగ్, ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ దరఖాస్తులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి వివరాలను వెబ్‌సైట్‌లో, సమగ్ర శిక్షా కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్.తిరుమల చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే 30, 31 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోపు ఫిర్యాదుచేయవచ్చని, జిల్లా కలెక్టర్ మెరిట్ అభ్యర్థుల ఎంపిక జాబితా అందజేస్తారని పేర్కొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి



రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో సోమవారం జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన యడ్ల నారాయణమ్మ(78) మంగళవారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం చెల్లింపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతనం వారి ఖాతాల్లో మంగళవారం జమచేశారు. వీరు పది నెలలు పనిచేయగా, అక్టోబర్ 10న రెండు నెలలు వేతనం చెల్లించారు. ప్రస్తుతం మూడు నెలల వేతనం చెల్లించారు. ఇంకా ఐదు నెలల వేతన బకాయిలు ఉన్నాయి.

వ్యక్తిపై హత్య కేసు నమోదు

నందిగాం: మండలంలోని మర్లపాడులో వితంతువు తర్ని వరలక్ష్మి(60) మృతికి కారణమైన వ్యక్తిపై హత్య కేసు నమోదైంది. గ్రామంలో నివాసముంటున్న వరలక్ష్మికి, సమీపంలోనే నివాసముంటున్న మరిది జానకిరామయ్యకు పొలం విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 22న మరోసారి గొడవ జరగడంతో జానకిరామయ్య కర్రతో వరలక్ష్మి తలపై బాదడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. వరలక్ష్మి భర్త, కుమారుడు గతంలోనే మృతిచెందారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కాగా, కోడలు కన్నవారింటికి వెళ్లిపోయింది. వరలక్ష్మి ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి చిన్న కుమార్తె రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు మంగళవారం హత్య కేసు నమోదు చేసి జానకిరామయ్యను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ. లక్ష విలువైన మందు గుండు సామగ్రి పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని సీపన్నాయుడుపేటలో ఓ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన లక్షరూపాయల విలువైన మందు గుండు సామగ్రిని టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అసాంఘిక పనులకు అడ్డాగా..!

- అస్తవ్యస్తంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం ప్రాంతం
- గంజాయి, మందుబాబులకు నిలయంగా పాడుబడిన గదులు
- పట్టించుకోని అధికారులు


శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల వసతిగృహం దుస్థితి..

శ్రీకాకుళం క్రైమ్ : పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (ఆర్ట్స్) పరిస్థితి. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ కాలేజీ నేడు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసలై యువత చెడిపోతున్న తరుణంలో ఇక్కడి ఆవరణలో జరుగుతున్న ఆకృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై అధికారులు దృష్టిపెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

అన్ని విభాగాలు.. కార్యక్రమాలు ఇక్కడే..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. డిగ్రీ, పీజీ విద్యార్థులు 1500 మంది, ఇంటర్ విద్యార్థులు 1000 మంది, వైటీసీ (యూత్ ట్రైబల్ సెంటర్) వందమంది వరకు ఉండగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 500 మంది వరకు వస్తుంటారు. ఇవి కాక డీవీఈవో (డిస్ట్రిక్ట్ వొకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీస్), ఆర్ఐవో (రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీస్), ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ విభాగాలు ఇక్కడే ఉన్నాయి. ప్రభుత్వానికి సంబంధించి అన్ని రకాల కార్యక్రమాలు (ఫ్లాగ్ హోస్టింగ్, పోలీస్ పెరేడ్, బందోబస్తు, ఎన్నికల విధులు, సామగ్రి భద్రపర్చడం, దీపావళి బాణసంచా అమ్మకాలు, గేమ్స్ తదితర అన్నీ) ఇక్కడే జరుగుతాయి. ఇక్కడ చదివే విద్యార్థులు, పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులు, ప్రభుత్వ కార్యక్రమాల పరంగా ఎక్కడా రాని న్యూసెన్స్.. నిత్యం వచ్చే బయట వ్యక్తులు, యువత నుంచి వస్తుండటంతో కళాశాల సిబ్బంది ఎదిరించలేక మిన్నకుండిపోతున్నారు.

అడిగితే బెదిరింపులే..

ఉదయం, సాయంత్రం కళాశాల తరగతులు లేనప్పుడు కొంతమంది వాకర్లతో ఎటువంటి ఇబ్బందులు లేనప్పటికీ మరికొందరు మాత్రం ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు బయటి వ్యక్తులు ఏకంగా మద్యం బాటిళ్లు పట్టుకుని మైదానంలోకి వచ్చేస్తుంటారు. ఇంకొందరు ఏకంగా జంటలుగా వచ్చి విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటారు. ఇదేంటని ప్రశ్నిస్తే కళాశాల పబ్లిక్ ప్రాపర్టీ అంటూ వితండవాదానికి దిగుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వైపులా మార్గాలే..

కళాశాలకు ప్రధానంగా నాలుగు మార్గాలున్నా.. రెండు మార్గాలు క్లోజ్ చేసి మిగతా రెండు మార్గాలు వాడుతుంటారు. కానీ కళాశాలను, గ్రౌండ్‌ను ఆనుకొని రక్షణ గోడకు ఆకతాయిలు కొన్ని చోట్ల ఛిద్రం చేశాయి. లోపలకి చొరబడిన ఆవరణను అడ్డాగా మార్చుకున్నారు. పాడైపోయిన విద్యార్థుల వసతిగృహం, ఓపెన్ యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వెనుక భాగాలను అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, సిగరెట్టు ప్యాకెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాల తయారీకి ఉపయోగించే కవర్లే కనిపిస్తున్నాయి.


ఈ పంపుహౌస్ వద్దే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెబుతున్న విద్యార్థులు


మత్తు పీల్చేముందు ఇలా కాల్చి..

ఎస్పీకి నివేదిస్తాం..



వసతిగృహం వద్దకు తనిఖీకి వెళ్లాలంటే భయమేస్తుంది. దారి పొడవునా బీరు బాటిళ్లు, మత్తు పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తుంటాయి. ఎవరెవరో వచ్చి పోతుంటారు. గట్టిగా అడిగితే తిరగబడతారు. గతంలో పోలీస్ పెట్రోలింగ్ ఉండేది. తర్వాత ఆగిపోయింది. ప్రస్తుత ఎస్పీకి ఇక్కడి అసాంఘిక కార్యకలాపాలపై నివేదిస్తాం.

– డాక్టర్ పి.సురేఖ, ప్రిన్సిపల్, ఆర్ట్స్ కళాశాల

దృష్టిపెట్టాలి..



మా కళాశాల అంటే చాలా ఇష్టం. కానీ వచ్చే పోయే మార్గాల్లో బయట వ్యక్తులు, యువత వచ్చి చెత్త పనులు చేస్తున్నారు. విద్యార్థులకు భద్రత లేకుండాపోతోంది. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీలు దృష్టిపెట్టి మా కళాశాలను పరిరక్షించాలి.

– ఎస్.ప్రేమ్, డిగ్రీ మూడో సంవత్సరం, ఆర్ట్స్ కళాశాల

ఓటరు ముసాయిదా జాబితా విడుదల


మాట్లాడుతున్న డీఆర్‌వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా-2025 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే నవంబర్ 28లోపు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించారని, మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు 2025 జనవరి ఒకటో తేదీ నాటికి అర్హులైన వారి నుంచి కొత్తగా ఫారం-6 దరఖాస్తులు స్వీకరించినట్లు వివరించారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల(మే 13) నాటికి జిల్లాలో 18,59,910 మంది(పురుషులు- 9,22,442 – స్త్రీలు 9,37,329) ఓటర్లు ఉన్నారని, తాజా ముసాయిదా ప్రకారం 18,77,426కి చేరిందని చెప్పారు. ఇందులో సర్వీసు ఓటర్లు 16240 మంది, పురుషులు 9,30479 మంది, మహిళలు 9,46,817 మంది, ఇతరు 130 మంది ఉన్నారని వివరించారు. ప్రస్తుతమున్న 2,358 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ఓటర్ల నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని, వచ్చే నెల 23న ఉపాధ్యాయ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తామని ప్రకటించారు. డిసెంబర్ 8వ తేదీ దరఖాస్తుకు చివరి తేదీ అని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వైద్యకళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సీ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామసభ తీర్మానాలు లేని పనులు రద్దు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తొగరాం సర్పంచ్ వాణీ సీతారాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస మండలం తొగరాంలో ఆగస్టు 23న గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, వాటిని రద్దుచేసి పంచాయతీ పంచాయతీ ప్రథమ పౌరులకు ప్రాధాన్యం కల్పించాలని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీ సీతారాం కోరారు. ఈ మేరకు ఆమదాలవలస మండల ఎంపీటీసీలతో కలిసి మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అనుమతులు లేకుండా, విభాగ అధికారులు హాజరుకానప్పటికీ ప్రతిపాదనలు సిద్ధం చేయడం సరికాదని, మరోసారి గ్రామసభ నిర్వహించాలని విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, వైస్ ఎంపీపీలు సోమరాజు జగన్నాథం, మానుకొండ ధనలక్ష్మి, కూటికుప్పల సన్యాసిరావు, తాండ్ర లక్ష్మి, దామోదర్‌రావు, చల్లా సింహాచలం, గురుగుబెల్లి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న జాతుల చేపల పెంపకం లాభదాయకం


కరదీపికను ఆవిష్కరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, మత్స్యకార రైతులు

ఆమదాలవలస: విభిన్న జాతుల చేపల పెంపకంతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని కృషివిజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమదాలవలసలోని కృషివిజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన వృత్తి విద్య శిక్షణా ముగింపు కార్యక్రమంలో రైతులకు శిక్షణ పత్రాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపలకు తరచూ వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి నివారణ పద్ధతులు అమలు చేస్తే దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం 'చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు' పేరిట రూపొందించిన కరదీపికను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీఈడీఏ విశాఖపట్నం డైరెక్టర్ ప్రసాద్‌నాయక్, నాక్సా (ఎన్ఎసీఎస్ఏ) కో-ఆర్డినేటర్ బాలాజీ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక


క్రీడాకారులతో బలభద్రుని రాజా, కోచ్, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో విజేతలై జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా పిలుపునిచ్చారు. ఇటీవలి నంద్యాలలో జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాణించి బంగారు పతకాలు సాధించిన జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు ఎల్.డార్విన్, పి.ఆమనిలను మంగళవారం శ్రీకాకుళంలోని ఫెన్సింగ్ శిక్షణా కేంద్రం వద్ద అభినందించారు. ఇందులో ఎల్.డార్విన్ జెడ్పీహెచ్‌స్కూల్‌లో కరకవలసలో చదువుతుండగా, పి.ఆమని జెడ్పీహెచ్ స్కూల్ సతివాడలో చదువుతోంది. వీరు నవంబర్ 17 నుంచి జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న ఆలిండియా స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీలకు వెళ్లేందుకు అసోసియేషన్ తరపున తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోచ్ వంశీ, పీడీలు భవానీ, డి.యశోద, అనిత, పి.రాములమ్మ, రాహుల్ పాల్గొన్నారు.

వంతెన చెంతనే తవ్వకాలు


తెలికిపెంట బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట- జలుమూరు మండలంలోని కొమనాపల్లి గ్రామాల నడుమ వంశధార నదిపై ఉన్న వంతెనకు ఆనుకునే ఇసుక తవ్వకాలు జరుపుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు నిబంధనలకు విరుద్ధం. అయినా ఇసుకాసురాలు ఆగకుండా తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా కొమనాపల్లి, చల్లపేట, జర్జంగి, కొత్తపేట, కోటబొమ్మాలి, టెక్కలి తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దీంతో బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందని, అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై తహసీల్దార్ ఎల్.మధుసూదన వద్ద ప్రస్తావించగా నదితీర ప్రాంతాలు, బ్రిడ్జీల సమీపంలో తవ్వకాలు చేయడం చట్టరీత్యానేరమని, వెంటనే పరిశీలన చేస్తామని తెలిపారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్టు

సారవకోట: మండలంలోని కురిడింగి గ్రామానికి చెందిన అలికాపు తిరుమలను పోక్సో కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ లక్ష్మి నరసింహ తెలిపారు. ఈ నెల 16న గొట్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామానికి చెందిన బాలికను నమ్మించి గర్భవతి చేసినట్లు నమోదైన కేసుపై డీపీటీసీ డీఎస్పీ విచారణ చేపట్టి మంగళవారం ఆ యువకుడిని పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సెక్షన్లు క్రింద అరెస్టు చేసి పాతపట్నం రిమాండ్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు.

బాధితుడికి సాయం

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తెలుకులు ప్రశాంత్ ఇటీవల మేడ పైనుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యఖర్చుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు రూ.1,36,500ను కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

క్రికెట్ ఆడుతూ యువకుడు మృతి


కృష్ణ ప్రసాద్(ఫైల్)

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన యగ్గళ్ల కృష్ణప్రసాద్ అలియాస్ సంతోష్ (25) క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించిన కృష్ణప్రసాద్‌కు క్రికెట్ అంటే మక్కువ. స్నేహితులతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ ఆడుతూ అలసట ఉందని తన గదికి వచ్చేశాడు. గుండెపోటు రావడంతో స్నేహితులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం సత్యవరం తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారుడు ఇక లేడని తెలిసి తల్లిదండ్రులు కృష్ణమూర్తినాయుడు, సూర్యకుమారి తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు, మేజరు పంచాయతీ వార్డు సభ్యులు ఇప్పిలి నీలం సంతాపం వ్యక్తం చేశారు.

పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య


సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రజల కోసం జ్వలించి కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచిన పుచ్చలపల్లి సుందరయ్య పోరాట యోధుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సుందరయ్య విగ్రహాన్ని శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్య్ర సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనంలో మంగళవారం సీపీఎం నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సభ్యులు బెండి తులసీదాస్, రచయిత అట్టాడ అప్పలనాయుడు, జర్నలిస్టు నల్లి ధర్మారావు, గాంధీ మందిర ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, నటుకుల మోహన్, పైడి హరనాథ రావు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలకు చిక్కిన చైన్‌స్నాచర్లు


బైక్‌పై వెళ్తున్న దుండగులు వీరే..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జీడి కార్మికురాలి మంగళసూత్రం తెంచుకుని బైక్‌పై పరారైన చైన్‌స్నాచర్ల చిత్రాలు కేటీ రోడ్డులోని సీసీ కెమెరాకు చిక్కాయి. గొలుసు రోల్డ్ గోల్డ్ అని తెలిసి పడేసి పరారవుతున్న దృశ్యాలు అందులో నిక్షిప్తమయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాణించిన శ్రీకాకుళం క్రికెట్ జట్టు


సెంచరీతో అభివాదం చేస్తున్న నల్లా జోగేంద్ర

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం బాలురు జట్టు అదరగొడుతోంది. మంగళవారం వైఎస్సార్ కడప జిల్లాలో ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-14 బాలుర మల్టీడేస్(త్రీడేస్ మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నమెంట్‌లో విజయనగరంతో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం టాపార్డర్ బ్యాటర్లు నల్లా జోగేంద్ర సెంచరీ, ఎస్‌వీఎస్ వివేకానందా అర్ధసెంచరీలు సాధించడంతో 89.3 ఓవర్లలో 336 పరుగుల వద్ద ఆలౌటైంది. వీరు రాణింపుపై జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష,కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, మదినా శైలానీ, డాక్టర్ రవికుమార్ తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులు ఏ కోర్సు చదివినా అందులో నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయని, అందుకే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నైపుణ్య గణన -2024' జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆటోమేషన్, కృత్రిమ మేధ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న సిబ్బంది మున్సిపాలిటీలు, గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. నవంబర్ మొదటి వారంలో నైపుణ్యగణన ప్రారంభించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ ధర్మేంద్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయ్, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రవీంద్ర, మాస్టర్ ట్రైనర్ ధర్మేంద్ర, ఎ.పి.ఎస్.ఎస్.డి.సి సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్వోను కలిసిన రెవెన్యూ సంఘ ప్రతినిధులు


డీఆర్ఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మార్రెల్ల వెంకటేశ్వరరావును జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ రామలింగం, యూనిట్ అధ్యక్షుడు ఎస్.కిరణ్ కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం


యునిక్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో యునిక్స్ క్లబ్ (పరిశోధనాత్మక క్లబ్)ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లబ్ సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకడమిక్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్) సంస్థలో కలిసి పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్డీ కావ్యజ్యోత్స్న, ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.